క్లుప్తంగా

బీజేపీ బలోపేతానికి కృషి



పెబ్బేరు రూరల్: వనపర్తి జిల్లా బీజేపీ నూతన అధ్యక్షుడు నారాయణను మంగళవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్, మండల ఉపాధ్యక్షుడు పాతపల్లి దేవేందర్‌నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి నాగరాజుయాదవ్, మొగిలి రఘు, గోవిందు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ గ్రామాన బీజేపీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

బహుమతుల అందజేత



పెబ్బేరు రూరల్: మండల కేంద్రంలో ఉమ్మడి మండల స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 12 జట్లు పాల్గొనగా.. వారిలో మొదటి బహుమతి పెబ్బేరు జట్టు రూ.15 వేలు, రెండో బహుమతి శ్రీరంగాపురం జట్టు రూ.10 వేలు గెలుపొందారు. విజేతలకు మున్సిపల్ చైర్మన్ కరుణశ్రీ, వైస్ చైర్మన్ కర్రె స్వామి, కౌన్సిలర్ బహుమతులు అందజేశారు.

ప్రెస్ క్లబ్ కమిటీ ఎన్నిక

పెబ్బేరు రూరల్: మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో సీనియర్ జర్నలిస్టులు రమేష్, రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రెస్‌క్లబ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గౌడుగు బాలవర్ధన్, ఉపాధ్యక్షులుగా గోపాలకృష్ణ, కిరణ్‌కుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా కుమ్మరి పరశురాముడు, కోశాధికారిగా బి రమేష్, ముఖ్య సలహాదారుడుగా రవీందర్‌గౌడ్, ప్రచార కార్యదర్శి రాజేష్, అతిక్‌పాషాను ఎనుకున్నారు.

నర్సరీల పరిశీలన



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని గట్లఖానాపూర్, చిలుకటోనిపల్లి, వెల్టూర్, మోజర్ల, మద్దిగట్ల, అమ్మపల్లి గ్రామాల్లోని నర్సరీలను ఎంపీడీఓ అఫ్జల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నర్సరీల్లో మొక్కల పెరుగుదలకు చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. నర్సరీలో మొక్కలు లేని చోట విత్తనాలు వేసి మొక్కలు వచ్చే విధంగా చూడాలని ఆదేశించారు. హరితహారంలో నాటిన ప్రతి మొక్కను కాపాడుకోవాలన్నారు. వేసవి సమీపిస్తుండటంతో మొక్కలకు ఉదయం, సాయంత్రం రెండు పూటల నీళ్లు పట్టాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెంచేలా బోధన



పాన్‌గల్: విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారి సామర్థ్యాలను పెంచేలా బోధన సాగించాలని ఎంఈఓ లక్ష్మణ్ నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పీఎస్, యూపీఎస్, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులు, మధ్యాహ్న భోజనంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. లక్ష్య, ఉన్నతి, తొలిమెట్టు కార్యక్రమాల అమలు, విద్యార్థుల ప్రగతి, పది విద్యార్థుల రివిజన్ టెస్ట్ ఫలితాలు తదితర అంశాలపై పాఠశాలల వారీగా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో నోడల్ ఆఫీసర్ శ్రీరాములు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు విష్ణువర్ధన్ రెడ్డి, రవికుమార్, సీఆర్పీలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

పట్టణ అధ్యక్షుడిగా రఫీక్

ఆత్మకూర్: పట్టణ కాంగ్రెస్ పార్టీ మైనార్టీసెల్ అధ్యక్షుడిగా మహ్మద్ రఫీక్‌ను నియమిస్తూ మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, టీపీసీసీ రాష్ట్ర కల్లుగీత డిపార్ట్‌మెంట్ చైర్మన్ కేషం నాగరాజుగౌడ్ నియామకపత్రం అందించారు. మంగళవారం ఆత్మకూర్‌లో జరిగిన కార్యక్రమంలో తనను పట్టణ మైనార్టీ అధ్యక్షుడిగా నియమించడంపై రఫీక్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈసందర్భంగా నాయకులు రఫీక్‌ను అభినందించారు.



గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



చింతరెడ్డిపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



ఆముదాలకుంటలో..

గోపాల్‌పేట: గ్రామాల్లో అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో కాంగ్రెస్ ప్రభుత్వం చేసి చూపిస్తుందని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో పర్యటించి పాటిగడ్డతండా, పాలికెపహాడ్, ఆముదాలకుంట, రేవల్లి మండలంలోని గొల్లపల్లి గ్రామాల్లో నూతన గ్రామ పంచాయతీ భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజల ఇబ్బందులను పరిష్కరించాలని సూచించారు. గోపాల్‌పేటలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాంనగర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రానికి ర్యాకులు అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు భార్గవి, సత్యశీలారెడ్డి పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: ఉమ్మడి పెబ్బేరు మండలంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రారంభించారు. తాటిపాముల ఆర్యనాయక్‌తండాలో తాగునీటి ట్యాంక్‌కు శంకుస్థాపన చేసి ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. తరగతి గదుల్లో పెచ్చులు ఊడుతుండడంతో నతన గదుల నిర్మాణానికి తగు చర్యలు తీసుకుంటానని హమీ ఇచ్చారు. కంభాళాపురంలో నూతన గ్రామ పంచాయతీ భవనం, పెబ్బేరు మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవనం, పెంచికలపాడులో వాల్మీకి కమ్యూనిటీ భవనం, తోమాలపల్లిలో యాదవ, వాల్మీకి భవనం, సూగూరులో అంగన్‌వాడీ భవనం, పాతపల్లిలో వాల్మీకి భవనం, అంబేడ్కర్‌నగర్‌లో తాగునీటి బోరును ప్రారంభించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎద్దుల కరుణశ్రీ, జెడ్పీటీసీ రాజేంద్రప్రసాద్, పద్మ, ఎంపీపీ ఆవుల శైలజ, వైస్‌ఎంపీపీ బాలచంద్రారెడ్డి పాల్గొన్నారు.

అమరచింత: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం అంకిత బావంతో పనిచేస్తున్నామని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మండలంలోని కిష్టపల్లిలో నూతన గ్రామపంచాయతీ కార్యాలయ ప్రారంభోత్సవంతో పాటు మిట్టనందిమళ్లలో అంగన్‌వాడీ భవనం, చింతరెడ్డిపల్లిలో పంచాయతీ భవనాలను మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నెరవేర్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం ఎమ్మెల్యేను ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పార్టీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు చెన్నమ్మ, సర్వారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ సరోజ, వైస్‌ఎంపీపీ బాల్‌రెడ్డి, తహసీల్దార్ చాంద్‌పాషా, ఎంపీడీఓ జ్యోతి, పీఆర్ ఈఈ శ్రీనివాస్‌రావు, టీపీసీసీ గీత కార్మిక సెల్ రాష్ట్ర కన్వీనర్ కేశం నాగరాజ్‌గౌడ్, ఆయూబ్‌ఖాన్, మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, మహంకాళీ విష్ణు, పోసిరిగారి విష్ణు, హన్మంత్‌నాయక్ పాల్గొన్నారు.

మదనాపురం: గోపన్‌పేటలో రూ.20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని మంగళవారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రారంభించారు. సర్పంచు ఆంజనేయులుయాదవ్, ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ కృష్ణయ్య యాదవ్ ఉన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న నరేందర్

పాన్‌గల్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని డీసీపీయూ సోషల్ వర్కర్ నరేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మహిళా శిశు సంక్షేమ శాఖ, బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు బాల్య వివాహాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనంలో వివాహాలు చేయడం వలన కలిగే నష్టాలు, బాల్య వివాహ నిషేధ చట్టం 2006, బాలల హక్కులు, టోల్ ఫ్రీ నెంబర్లు 1098, 100 అంశాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలను నిర్మూలించడంలో ప్రతి ఒక్కరూ తమ తోడ్పాటు నందించాలని, అంగన్‌వాడీ కార్యకర్తలు గ్రామాల్లో అవగాహన కల్పించి ప్రజలల్లో చైతన్యం కలిగించాలని సూచించారు. సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఆసియా బేగం, షాహిన్‌బేగం, శ్రీవాణి, సుమ, సులోని, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



బుద్దారంలో నిత్యావసర సరుకులు అందిస్తున్న రెడ్ క్రాస్ సభ్యులు

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని చందాపురం గ్రామానికి చెందిన కావలి నాగన్న మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి మంగళవారం గ్రామంలో మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, బీఆర్‌ఎస్ నాయకులు నరసింహ, చిట్యాల రాము, నాగరాజు, పెంటన్న, బాబు నాయక్, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: విపత్కర పరిస్థితుల్లో బాధితులకు రెడ్ క్రాస్ సొసైటీ ఎప్పటికీ అండగా ఉంటుందని జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ సయ్యద్ కలాంపాషా అన్నారు. మండలంలోని బుద్దారం గ్రామానికి చెందిన గొల్ల పరమేష్ ఆర్థిక పరిస్థితి ఇబ్బందిగా ఉండడంతో మంగళవారం కలెక్టర్ సూచన మేరకు రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు వారికి నిత్యావసర సరుకులు, వంట సామగ్రి, హైజెనిక్ కిట్‌ను అందించారు. విపత్కర పరిస్థితిలో ఉన్నవారికి ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో యాదగిరి, రాజేందర్, పాష తదితరులు పాల్గొన్నారు.

సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి



వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

వనపర్తి: రైతులు సాగులో యాజమాన్య పద్ధతులు పాటించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించాలని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ, రాజేందర్‌నగర్ అగ్రికల్చరల్ ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్ సీసీఎస్ హనరరీ డైరెక్టర్ డా.సుహాసిని, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి, అసిస్టెంట్ స్టాటిస్టిషియన్ టీఎం దినేష్, ఏఆర్‌టీఏ సుమన్ తెలిపారు. పంటల క్షేత్ర పరిశీలనలో భాగంగా వారు మంగళవారం మండలంలోని పెద్దగూడెం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఏఈఓ జగన్ మాట్లాడుతూ రైతులు సాగులో పెట్టుబడి, వచ్చే దిగుబడిని అంచనా వేసి కేంద్ర గణాంక శాఖ సైట్‌లో పొందుపరుస్తామని తెలిపారు. రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారులను సంప్రదించి సాగులో ఖర్చులను తగ్గించుకునేలా ప్రణాళిక తయారు చేసుకోవాలని సూచించారు. వరి వెదజల్లే పద్ధతిలో ఎకరాకు కేవలం 25 నుంచి 30 కిలోల విత్తనాలు వినియోగించాలని వివరించారు. కార్యక్రమంలో రైతులు తోక తిరుపతయ్య, ఉండేటి నంద కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయం



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు నారాయణ

ఖిల్లాఘనపురం: సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ 12 ఎంపీ సీట్లు సాధిస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ జోస్యం చెప్పారు. జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తరువాత మంగళవారం మొదటిసారి మండలానికి వచ్చిన ఆయన మొదటగా మండలంలోని గట్టుకాడిపల్లి లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండల కేంద్రానికి చేరుకున్న ఆయన మండల ఇన్‌చార్జ్ శ్రీశైలం, అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిబాబుగౌడ్‌తో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అహంకారంతో మాట్లాడిన బీఆర్‌ఎస్ నాయకులను ప్రజలు ఇంటికి పంపించారని ఎద్దేవా చేశారు. ఆరు గ్యారంటీలతో ప్రజలకు హామీలిచ్చిన కాంగ్రెస్ అధికారం చేపట్టిందన్నారు. ఇచ్చిన హామీ మేరకు 100 రోజుల్లో 6 గ్యారంటీలను అమలు చేయకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ప్రజల పక్షాన నిలదీస్తామన్నారు. దేశంలోని అన్ని ప్రాంతాల్లో ప్రజలు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వెంటే ఉన్నారని చెప్పారు. అత్యధిక సీట్లు సాధించి మూడోసారి ప్రధాని బాధ్యతలు చేపడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆశన్న, గోపాల్‌రెడ్డి, గోపి, ఈదమ్మ, సత్యనారాయణ, శివ, రవీందర్ పాల్గొన్నారు.

ఒండ్రు మట్టి తరలింపుపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని గణపసముద్రం చెరువులోని పట్టా భూముల్లో ఒండ్రుమట్టి తరలింపుపై మంగళవారం రైతులు తహసీల్దార్ పాండునాయక్‌కు ఫిర్యాదు చేశారు. చెరువులోని భూముల్లో సర్వే నెంబర్ 303, 304 లో రాత్రివేళలో అక్రమంగా మట్టి తరలించినట్లు రైతులు గగ్గలపల్లి బాల్‌రెడ్డి, లచ్చిరెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు తెలిపారు. పట్టా రైతులమైన తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సుమారు అరెకరం భూమిలో ఒండుమట్టిని తరలించారని ఆందోళన వ్యక్తం చేశారు. అనుమతులు లేకుండా రైతులకు తెలియకుండా ఒండ్రుమట్టిని తరలించిన వారి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. మట్టిని ఇటుక బట్టీల నిర్వాహకులు తరలించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై తహసీల్దార్ మాట్లాడుతూ ఒండుమట్టి తరలింపు విషయమై ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇచ్చామని తెలిపారు. బుధవారం వారు చెరువు దగ్గరకు వెళ్లి పరిశీలిస్తారని, విచారణ చేసిన తర్వాత బాధ్యులపై చర్యలు తీసుకుంటామని వివరించారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



గోపాల్‌పేట: రేవల్లి మండలంలోని చెన్నారం గ్రామంలో మంగళవారం హైదరాబాద్‌లోని సైఫాబాద్‌కు చెందిన సామాజిక విజ్ఞాన కళాశాల విద్యార్థులు సమతుల్య ఆహారం తీసుకోవడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంచి ఆరోగ్యం కోసం పోషకాహారం ఎంతో ముఖ్యమని, వాటిని ఎంత మోతాదులో తీసుకోవాలని వివరించారు. మధుమేహం, రక్తపోటు, రక్తహీనత, విటమిన్ ఏ, అయోడిన్ లోపం ఉన్నవారు ఎలాంటి ఆహారం తీసుకోవాలని, ఎటువంటి ఆహారం తీసుకోవద్దని చార్టుల ద్వారా వివరించారు.

జాతిపితకు ఘన నివాళి



మదనాపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు



పెద్దమందడిలో..



వనపర్తిలో..

సాక్షి, నెట్‌వర్క్: మహాత్మాగాంధీ 76వ వర్ధంతిని పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాల వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గాంధీజీ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ప్రతి ఒక్కరూ అహింస మార్గంలో పయనించి గాంధీ ఆశయాల కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. అనంతరం కుష్ఠు వ్యాధి నిర్మూలన ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో బోయేజ్, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రాముయాదవ్, విజయ్‌కుమార్, రమేష్, రామకృష్ణారెడ్డి, జయకర్ ఎంపీటీసీ ఎల్లస్వామి, కుమ్మరి గోవిందు, తహసీల్దార్ అబ్రహం, ఎంపీడీఓ నాగేంద్రం, సర్పంచ్ రాంనారాయణ హెల్త్ సూపర్‌వైజర్ ప్రమీల, నాయకులు జగదీష్, వడ్డె కృష్ణ, శేఖర్‌రెడ్డి, రామకృష్ణ, మహేష్, కుమార్, వెంకటేష్ యాదవ్, వేమన్న, కురుమయ్య, సాయివెంకట్, బాబి తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్తుల తోడ్పాటు మరువలేనిది



దావత్‌ఖాన్‌పల్లిలో గ్రామ పంచాయతీ పాలకమండలిని సన్మానిస్తున్న గ్రామస్తులు



పెద్దగూడెంలో..



ఈర్లతండాలో..

పాన్‌గల్: ఐదేళ్ల గ్రామాభివృద్ధికి ప్రజలు అందించిన తోడ్పాటు మరువలేనిదని దావత్‌ఖాన్‌పల్లి సర్పంచ్ కొంకల నాగేశ్వర్‌నాయుడు, ఉప సర్పంచ్ మాణిక్యమ్మ అన్నారు. పంచాయతీ సభ్యుల పదవీకాలం ముగుస్తున్న సందర్భంగా మంగళవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి పార్టీలకతీతంగా ప్రజలు అందించిన సహకారం ఎప్పటికీ మరువలేనన్నారు.

ఖిల్లాఘనపురం: మండలంలోని ఈర్లతండా సర్పంచ్, వార్డు సభ్యులను మంగళవారం ఘనంగా సత్కరించారు. ఫిబ్రవరి 2 తో సర్పంచుల కాల పరిమితి పూర్తి కావస్తుండటంతో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకవర్గాన్ని గ్రామానికి చెందిన రాములు తదితర యువకులు, పెద్దలు శాలువాలతో సన్మాణించారు. అనంతరం సభలో ధన్యవాద తీర్మానం తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపాల్‌నాయక్, ఉప సర్పంచు సబావత్ టోగ్యానాయక్, వార్డు సభ్యులు దస్లి, శాంతి, జెమిని, రవి, బాల్యా, పంచాయతీ కార్యదర్శి ఎండీ లియాకత్, వనపర్తి నియోజక వర్గం నుంచి ఎమ్మెల్యేగా స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేసిన కాట్రావత్ రాము గ్రామ పెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు సన్మానం

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని పెద్దగూడెం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కొండన్న అధ్యక్షతన చివరి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఐదేళ్లుగా గ్రామ అభివృద్ధికి తమ వంతు కృషి చేశామని, గ్రామస్తుల సహకారం మరువలేనిదని తెలిపారు. అనంతరం సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కురుమూర్తి, కార్యదర్శి మల్లికార్జున్, ఉపసర్పంచ్ భాస్కర్‌గౌడ్, ఎఫ్ఏ నయ్యూంపాషా, వార్డు సభ్యులు శ్రీనివాసులు, ఖాసీం, ముత్యాలమ్మ, ఆరేపల్లి లక్ష్మి, రేష్మబేగం, సుజాత, మాణిక్యం, గొల్ల భీసమ్మ, అలివేల పాల్గొన్నారు.

ధాన్యం చోరీపై కేసు నమోదు

పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లిలో ధాన్యం చోరీపై మంగళవారం కేసు నమోదైనట్లు ఎస్ఐ వేణు తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం గ్రామానికి చెందిన గుడిసె తిరుపతయ్య తాను పండించిన ట్రాలీ ధాన్యాన్ని ఈనెల 22వ తేదీన కేతేపల్లి సమీపంలో గల సింగిల్ విండో కొనుగోలు కేంద్రంలో కాంటా కోసం నిల్వ చేశారు. 22వ తేదీ రాత్రి ఇంటికి వెళ్లి తిరిగి 23వ తేదీన కొనుగోలు కేంద్రం దగ్గరికి వెళ్లి చూడగా ట్రాలీ ధాన్యం కనిపించలేదని, తన ధాన్యంతో పాటు ఇదే గ్రామానికి చెందిన పుట్ట రాజుకు చెందిన ట్రాలీ ధాన్యం, వెంకటస్వామికి చెందిన సగం ట్రాలీ ధాన్యం చోరీకి గురైందన్నారు. ముగ్గురు రైతులకు సంబంధించి దాదాపుగా 25 క్వింటాళ్ల ధాన్యం విలువ రూ.50 వేల వరకు ఉంటుందన్నారు. దీంతో రైతు తిరుపతయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సమన్వయంతోనే అభివృద్ధి సాధించాం



మాట్లాడుతున్న జెడ్పీటీసీ కృష్ణయ్య

మదనాపురం: ప్రజాప్రతినిధులు, అధికారుల సేవలు మరువలేనివని, వారందరూ సమన్వయంతో పనిచేస్తూ మండల అభివృద్ధి నిరంతరం పాటుపడుతున్నారని ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ కృష్ణయ్య అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ పద్మావతి అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశామని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం, పాలకులు అభివృద్ధిపై దృష్టి సారించి, పెండింగు పనులు పూర్తి చేయాలని కోరారు. అనంతరం ఆయా శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికను మండల సభలో వివరించారు. సర్పంచ్‌లకు చివరి సమావేశం కావడంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఐదేళ్ల కాలంలో చేసిన అభివృద్ధి పనులు చర్చించుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మూలమళ్ల యాదమ్మ, తహసీల్దార్ అబ్రహం లింకన్, ఎంపీడీఓ నాగేందర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రాఫ్ట్ టీచర్లకు అవకాశం ఇవ్వాలి

వీపనగండ్ల: రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రకటించనున్న మెగా డీఎస్సీలో క్రాఫ్ట్, ఆర్ట్, మ్యూజిక్ ఉపాధ్యాయులను కూడా నియమించే విధంగా చూడాలని తెలంగాణ ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ నిరుద్యోగుల సంఘం నాయకులు ఎమ్మెల్సీలుగా ఎంపిక కానున్న కోదండరాం, బల్మూర్ వెంకట్‌లకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు షహీదాబేగం, వినోద్, బొలమోని దర్గయ్య, శివప్రసాద్, శ్రీకాంత్, రమేష్, హరిక, వీణ, జేజేశ్వర్, నాగరాజు తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ఆత్మకూర్: మున్సిపాలిటీ కేంద్రంలో 2006లో 1,200 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చినా.. నేటి వరకు స్థలాలు కేటాయించలేదని సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ రాజుకి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా తెలంగాణ వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు, సీపీఎం నాయకులు బుచ్చన్న, భారతీయుడు, ఇస్మాయిల్, కుర్మన్న మాట్లాడుతూ గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారన్నారు. పదేళ్ల అనంతరం మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని, ఇప్పటికైనా 1,200 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు చూపించి ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షలు మంజూరు చేయాలని కోరారు.

సీసీ రోడ్డు నిర్మించండి

అమరచింత: పట్టణంలోని శివాజీనగర్‌లో జన్ను నారాయణ ఇంటి ముందున్న తాగునీటి బావి నుంచి తెల్గు రామకృష్ణ ఇంటి వరకు కొత్తగా సీసీ రహదారి నిర్మించాలంటూ కాలనీ వాసులు మున్సిపల్ మేనేజర్ కృష్ణయ్యకు మంగళవారం వినతి పత్రం అందించారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు తమ వార్డులో సీసీ రహదారి నిర్మాణం కోసం భూమిపూజ నిర్వహించారని, ప్రస్తుతం బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఓటమితో పనులు నిలిచిపోయాయన్నారు. మంజూరైన నిధులతో తమ కాలనీలో సీసీ రహదారిని నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ వాసులు సయ్యద్ నయ్యర్‌పాషా, శ్రీనివాసులు, పాండు, ప్యాట శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'మన భవిష్యత్ మన చేతుల్లోనే'

వనపర్తి టౌన్: మన భవిష్యత్తు మన చేతుల్లోనే ఉందని కార్పొరేట్ ఇన్‌స్టిట్యూషనల్ ట్రైనర్, బిజినెస్ కన్సల్టెంట్ స్పీకర్ కృష్ణప్రసాద్ అన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బ్లూ రిబ్బన్ ఓవర్సీస్ ఎడ్యుకేషనల్ కన్సల్టెంట్ ప్రైవేట్ లిమిటెడ్, మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో వృత్తి మార్గదర్శకత్వం, వ్యక్తిత్వ వికాసంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ రకాల ఉద్యోగాలకు సంబంధించి ఇంటర్వ్యూలో నడుచుకునే విధానం, మెలకువలు, ఉద్యోగాల అవకాశాలపై దిశానిర్దేశం చేశారు. విదేశాలలో ఉద్యోగ అవకాశాలను వివరించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు, వారి బంగారు భవిష్యత్‌కు ఎంతో ఉపయోగపడతాయని కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకటప్రసాద్, సత్యమ్మ, అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను కాపాడండి

అమరచింత: మున్సిపాలిటీలోని ప్రభుత్వ స్థలాలను కాపాడాలంటూ బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు భాస్కర్ మాట్లాడుతూ కొత్త బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న కందకం స్థలంతో పాటు విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ స్థలాల్లో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నోటీసు బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. అంతే కాకుండా పట్టణంలోని ఆయా వార్డుల్లో ఉన్న గౌటన్ భూములను సైతం పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో సరాల సిద్దురాములు, పద్మయ్య, మహేష్, రఘు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.